

# భయం

మల్లిక్

"రాధా !"

ఏమిటన్నట్లు శంకరం వైపుచూసింది రాధ.

"ఈవేళ సాయంత్రం ఆరుగంటలకి పార్కుకి రా.. నేను నీకోసం ఎదురు చూస్తుంటాను." శంకరం రాధవైపు సమాధానంకోసం చూశాడు.

"అమ్మబాబోయ్... మనకి తెలిసిన వాళ్లెవరైనా పార్కుకి వస్తే !!"

"నీ భయం నీది...ఎవరూ రారు లెద్దూ !..."

"ఏమో బాబూ...ఎవరైనా తెలిసిన వాళ్లు చూస్తే లేనిపోని గొడవ."

"పోనీ ఆదివారంనాడు స్నేహితురాలింటికి వెళ్తానని మీయింట్లో చెప్పి వచ్చేయ్...ఇద్దరం కలిసి సినిమాకి వెళ్దాం."

"అమ్మో !...సినిమాకే ?!!... అక్కడికి కూడా మనకి తెలిసినవాళ్లు రారని నమ్మకం ఏమిటి ?...అసలే ఆదివారం శలవురోజు...చాలమంది సినిమాలకి బయలుదేరతారు - ఎవరైనా చూస్తే కొంపమునుగుతుంది...నాకు భయం బాబూ" రాధ గుండెలమీద చెయ్యి వేసుకుంది.

శంకరం విసుగ్గా ముఖంపెట్టాడు.

"నువ్వు ప్రతిదానికి భయం అంటే ఎలా రాధా...పోనీ నువ్వే ఏదైనా ఉపాయం చెప్పు...మనం తీరికగా కూర్చుని తీయని కబుర్లు చెప్పుకుని ఎన్నాళ్లయిందో ?!!...ఎన్నాళ్లిలా దూర దూరంగా కనుసైగలు చేసుకుంటూ గడపడం ?" శంకరం దీనంగా ముఖం పెట్టాడు.

కొద్దిసేపు రాధ ఏమీ మాట్లాడలేదు ఉన్నట్లుండి-

"శంకరం...మా యింట్లో ఎట్లాగూ మన పెళ్లికి వప్పుకోరు...అందుచేత మనిద్దరం ఎటైనా పోయి పెళ్లి చేసుకుందాం" అంది ఆతృతగా శంకరం ముఖంలోకి చూస్తూ.

శంకరానికి కొద్దిరోజులలో రిటైర్ కాబోయే తండ్రి, పెళ్లి కావలసిన చెల్లెలు, రోగిష్టి తల్లి, కాలేజీ చదువులకు తనమీద ఆధారపడిన తమ్ముడు గుర్తుకు వచ్చారు.

"చెప్పు శంకరం! ...మనిద్దరం ఎటైనా పోదామా ?"

"అమ్మో !!..."

గుండెలమీద చెయ్యివేసుకున్నాడు బరువు బాధ్యతలున్న శంకరం.